# మెత్తని చూపు

పద్దమ్మకు గుండెలో రాయి పడింది.

'ఉస్సుర'ని నిట్టూర్చి క్రింద కూలబడింది.

ఉదయం ప్రశాంతమైన వేళ. ఎంద రెందరో వచ్చి వెళ్తున్నారు.

కొండపైన గుడి... ఎత్తుగా మెట్లు... అన్ని మెట్లమీదా రెండు చివరలా అదుక్కునేవాళ్ళూ. కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ, సాధువులూ, బైరాగులూ, అందరూ చేతులు చాపి అడుక్కుంటున్నారు. దైవ దర్శనం కోసం పైకి వెళ్ళేవారి ముందు చేతులుచాపి కొందరూ, నలిగిపోయిన సత్తుగిన్నెలు చాపి కొందరూ గొడవగొడవగా రొదచేస్తూ అడుక్కుంటున్నారు. ఇన్ని దాటుకుని అన్ని మెట్లు ఎక్కి పైకి వెడితే కొండమీద వెలసిన అమ్మవారి దర్శనం అవుతుంది. ఆమె ఎప్పుడో చిరకాలం క్రిందట కొండెక్కి కూర్చున్నది. ప్రపంచమంటే అసహ్యం పుట్టిందో, లేక ప్రపంచంలో కరుడుకట్టిన విషాదం చూసి భరించలేకనో, కాకపోతే ఈ ప్రపంచాన్ని ఉద్ధరించే శక్తిలేకనో మరెందుచేతనో అమ్మవారు కొండెక్కి కూర్చుండిపోయింది.

గుడిమెట్ల క్రింద రొద... జీవితపు సందడి... వరసగా చిన్న చిన్న దుకాణాలు... వాటిమీద కొబ్బరికాయలు పేర్చబడివున్నాయి. దుకాణాలుమీద వున్నవారు వచ్చేపోయేవారిని "అయ్యా రండి... అమ్మా రండి... అమ్మవారికి పసుపు కుంకుమ టెంకాయ కర్పూరం అన్నీ యిక్కడున్నాయి. చెప్పు లిక్కడ విడిచి పొండి. మేము భద్రంగా చూస్తూ వుంటాం" అని అరుస్తూ పిలుస్తున్నారు.

పద్దమ్మ తన గాజుకళ్ళను మాసిపోయిన చిరిగిపోయిన చీరె కొంగుతో తుడుచుకుంది. మళ్ళీ ఒక్కసారి ప్రక్కనే దుకాణంమీద కూర్చుని వున్న సూరమ్మను ఆఖరి ప్రయత్నంగా "సూరమ్మా... తీసుకోనా?" అని అడిగింది.

సూరమ్మ గొంతు పెద్దది చేసి "వొద్దని చెప్పానుగా, అయినా నీకు మేమే దొరికామా? ఇన్నాళ్ళూ సంగతి తెలియక ఊరుకున్నాను. ఇప్పు డొద్దంటున్నాను... అంతే... దాన్ని ముట్టుకోకు." అన్నది బేరం చూసుకుంటూనే.

సూరమ్మ మొగుడు ప్రక్కనేవుండి కొబ్బరికాయ పీచు తీస్తున్నాడు. అతనుకూడా తలవూపి "అంతే, దాన్ని ముట్టుకోకు." అన్నాడు. అతడు కొబ్బరిపీచు కొట్టు క్రింద పడేస్తున్నాడు. ఇప్పటికే అది పెద్ద గుట్టయింది. పద్దమ్మ ఆ కొబ్బరి పీచువంకనే ఆశగా చూస్తున్నది. కళ్ళార్పకుండా చూస్తున్నది.

ఆడామగా పిల్లామేకా యావన్మందీ సందడి చేస్తూ పూజాద్రవ్యాలు కొనుక్కుని పైకి వెడుతున్నారు.

పద్దమ్మ ఇకఏమీ మాట్లాడలేదు. చూపులు మాత్రం కొబ్బరి పీచుమీదే వున్నాయి. ఆ పీచు తనకి కావాలి. తనకది చాలా అవసరం.

పద్దమ్మ మళ్ళీ మరొకసారి కొబ్బరి పీచువంక చూసింది. తలపెకెత్తి సూరమ్మ ముఖంలోకి చూసి ఆ మొహంలో కాఠిన్యం గమనించింది. వెంటనే లేచి "పోస్లే అమ్మా, తాకస్లే దాన్ని, ఇదుగో పోతున్నాను." అంటూ చేతికర్ర, పాత గోనె సంచీ రెంటినీ అందుకుని తడబడుతూ నడిచి ఇవతలకి వచ్చింది.

ఎదురుగా ఉన్న మరో దుకాణం దగ్గరికి తూలుతూ నడిచి వెళ్ళింది. ఆ దుకాణదారుడు పద్దమ్మ వంక చూశాడు. ఆమె ఎండిన కొమ్మలాగున్నది. ఎముకల పోగులాగున్నది. జీవితమంతా నెత్తినెక్కి కూర్చున్న దారిద్ర్య దేవత బరువుకు క్రుంగిపోయి శుష్కించిపోయి వున్నది.

ఆమె ఆ కొట్టు క్రింద పడివున్న కొబ్బరి పీచు మీద చెయ్యివేసిందంతే... అతడు గద్దించాడు. "ఏవఁమ్మోవ్, దాన్ని తియ్యకు." అని గర్జించాడు.

పద్దమ్మ తలఎత్తి "కొంచెం తీసుకుంటాన్నాయనా? ఎవరూ లేనిదాన్ని కదుపుకోసం" అంటున్నది.

అతడు మళ్ళీ గర్జించాడు. "అదేం వీల్లేదు - పో ఇక్కణ్ణుంచి."

పద్దమ్మ దీనంగా ఇవతలకి వచ్చింది. ఈ తంతు చుట్టుపక్కల దుకాణాల వారందరూ చూడనేచూశారు. ఇహ లాభం లేదనుకొని ఇవతలకి వచ్చింది పద్దమ్మ. వీధి చివర మేడముందు మెట్టుమీద చతికిలబడింది. ఆమెకు అంతలో సముద్రం గుర్తు వచ్చింది. ఎందుకు గుర్తు వచ్చింది? ఎందుకు గుర్తు వచ్చిందో తెలీదు. ఆమె సముద్రం ఒకసారి మాత్రమే చూసింది. ఎప్పుడో భర్తవెంట సముద్ర స్నానానికి వెళ్లింది. ముందు ఆ అనంత జలరాశిని చూడగానే భయం కలిగింది. తర్వాత ఆనందం కలిగింది. అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నాడు నిప్పు ముద్దలా. పెద్దపెద్ద అలలు పెనుపాములు దొర్లుతున్నట్టున్నాయి. అంతలో క్రమంగా నీళ్ల మీద బంగారు పూత వేస్తూ పైకి వచ్చింది సూర్య బింబం. సముద్రుడు శ్వాస పీలుస్తున్నట్టు, సముద్ర గర్భంలో ఎక్కడో ఉన్న ఏవో అదృశ్య లోకాల విషాద సంగీతం లాటి నిర్విరామ ఘోష.

పద్దమ్మ మళ్ళీ కళ్లు తుడుచుకున్నది. చిన్నతనంలో శ్రావణ మాసాలు. ఆ సాయంకాలాలు. కుచ్చెళ్లు పైకి పట్టుకుని పసుపు కాళ్లతో ఆనందంగా నడిచిపోయే పడుచు పిల్లలు. ఆకాశంలో గుంపులు గుంపులుగా మబ్బులు.. ఉన్నట్టుండి పూలజల్లు కురిసినట్టు వాన జల్లులు, శనగలు ఇవన్ని గుర్తొచ్చాయి.

పద్దమ్మ నిట్టూర్చింది. కొబ్బరిపీచు దొరకలేదు. ఇంక దొరకదు. కాస్త ఆధరువు పోయింది. ఇన్నాళ్లూ కొబ్బరి పీచు కూడా డబ్బు తెచ్చి పెడుతుందని తెలియక సూరమ్మ దాన్ని తనకు వదిలేసింది. ఇవాళ ఆ వివరం తెలిసింది. ఇక తీసుకో నిస్తుందా?

పద్దమ్మ లేచింది. ఇవాల్టికి గూటికివెళ్లి ఇంత తిని పడుకోడం మంచిది. ఇక రేపటి సంగతా? పైన దేవుడు లేడూ? అంతగా ఏమీలేకపోతే గుడిమెట్లమీద ఎక్కడో ఖాళీచూసుకుని కూర్చుంటే సరి... కాని అదీ అంత తేలిక కాదే, ఇవాళ ఉదయమే మెట్ల దగ్గర ఇద్దరు ముష్టివాళ్లు... ఇద్దరూ ఆడవాళ్లే... అందులో ఒకతె కుంటిది - జుట్టు జుట్టు పట్టుకుని క్రిందపడి దొర్లుతూ పోట్లాడుకున్నారు. పేచీ ఎక్కడ వచ్చింది? తాను రోజూ కూర్చుని అడుక్కునే చోట మరో మనిషి వచ్చి కూర్చోడం కుంటిది సహించలేకపోయింది. ముందు వాగ్యుద్ధం-లాపాయింట్లు.... ఆ తర్వాత అసలు యుద్ధం... అలాటప్పుడు తనకు అక్కడ చోటు దొరుకుతుందా? అదీ అనుమానమే.

పద్దమ్మ నడుస్తున్నది. పైన ఎండ... రోజూ నెత్తిమీద కొబ్బరి పీచుతో గోనె సంచి వుండేది. ఇవాళ ఆ బరువు లేదు... విసురుగా వచ్చే లారీలను, బస్సులను, తోపుడు బండ్లను, రిక్షాలను తప్పుకుని నడిచింది. వంతన దాటి ఎత్తైన రోడ్డు మీదకి వచ్చింది. ఆ రోడ్డు క్రింద అటూ యిటూ పాకలు. పాకలనిండా జనం.

ఇది బాగా లారీలూ, బస్సులూ తిరిగే రోడ్డు.... పద్దమ్మ రోజూ కొబ్బరిపీచు తీసుకువెళ్లి ఆ రోడ్డు మీద పరిచి వుంచుతుంది. క్షణాని కొకటిచొప్పున విసురుగా కార్లూ, లారీలు, బస్సులూ వస్తుంటాయి కదా? ఆ పీచు బాగా నలుగుతుంది. తెల్లవారగానే పద్దమ్మ దాన్ని పోగుచేసి పలుచగా విడదీసి కొట్టువాడికిస్తే వాడు డబ్బులిస్తాడు. వాడు దాన్ని రిక్షాలకూ బస్సులకూ, ఉపయోగించే సీట్లుగా మార్చి విపరీతంగా సంపాయిస్తాడు.

నిన్నరాత్రి పద్దమ్మ కొబ్బరి పీచును నడిరోడ్డు మీద సర్దిపెట్టింది. అది బాగా నలిగివుంటుం దీపాటికి. ఒక గంటసేపు ఓపికగా కూర్చుని పలుచగా విడదీసి సంచిలో వేసుకుపోతే ఇవాల్టికి పావలా, లేక ముప్పై పైసలు వస్తాయి. దానితో ఈపూట గడుస్తుంది. రేపు సరే... ఏదో చూసుకోవచ్చు.

పద్దమ్మ నడుస్తున్న దల్లా చెయ్యి కళ్ళకు అడ్డం వుంచుకుని చూసింది. దూరంగా ఎవరో తన కొబ్బరి పీచును పోగుచేసి తీసుకుపోతున్నట్లు అనిపించింది. కలవరపాటుతో త్వరత్వరగా అడుగులు వేసింది.

అంతలోనే తడబడుతూ పరుగెత్తింది. “ఎవర్రా అది? అది నాది... దాన్ని ముట్టుకోకు” అని అరుస్తూ పరుగెత్తింది.

వెనక ఏదో తగిలినట్లయింది. పెద్ద లారీ... పైన దయ్యం బరువు.

పద్దమ్మ రోడ్డుమీదినుంచి దొర్లిపోయింది. చేతికర్ర దూరంగా పడిపోయింది. గోనెసంచి మరోప్రక్క పడిపోయింది. లారీ ఆగలేదు. రివ్వున దూసుకుపోయింది. పద్దమ్మ మళ్ళీ లేవలేదు.

❀ ❀ ❀